మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# రైతుల నష్టపోతే మరో ఉద్యమం చేస్తాం

## కోడూరు చౌరస్తా ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



నిరసనలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులకు యూరియా ఇవ్వకుండా ఇబ్బందులపాలు చేస్తున్నందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనగా మహబూబ్ నగర్ మండల పరిధిలోని కోడూరు చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు ఉన్న రైతుకు ఒకటి.. రెండు సంచులు యూరియా మాత్రమే అధికారులు ఇస్తున్నారని రెండు, మూడు ఐదు ఎకరాలు పంట వేసిన రైతుల పరిస్థితి ఏంటో ఆలోచన చేయాలన్నారు. తిండి తినకుండా రాత్రిళ్ళు వర్షంలో నిద్ర లేకుండా యూరియా కేంద్రల వద్ద రైతులు ఉన్న వారికీ యూరియా అందటం లేదన్నారు. ఇసుక, యూరియా కలుపుకొని చల్లాలి అని వ్యవసాయ మంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. యూరియా వేయకుంటే ఎకరాకు 40 సంచులకు బదులుగా 20 సంచులు వస్తాయి. రైతులు తీవ్రంగా నష్టపోతారని ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు నష్టపోతే ఈ జిల్లా నుంచి ఉద్యమం ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ సుధా శ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వివరాలు 4

### కృష్ణ వికారాబాద్ రైల్వే పనులు

# వెంటనే చేపట్టాలి

## రైల్వే బోర్డు సమావేశంలో ఎంపి.డికె. అరుణ



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** కృష్ణ , వికారాబాద్ రైల్వే లైన్ పనులు వెంటనే చేపట్టాలని పాలమూరు ఎంపి డికే.అరుణ రైల్వే అధికారులను ఆదేశించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వేనిలయంలో తెలుగు రాష్ట్రాల ఎంపీలతో జరిగిన సౌత్‌సెంట్రల్ యూజర్స్ కన్సల్టేటివ్ హైలెవల్ సమావేశంలో ఆమె పాల్గొని ఉమ్మడి పాలమూరు జిల్లా రైల్వేప్రాజెక్టులను ప్రస్తావిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్‌జిల్లా పరిధిలో, పార్లమెంట్‌పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలను మీటింగ్‌లో ప్రస్తావించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ.అరుణమ్మ ఇచ్చిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన అధికారులు, బోర్డు పరిశీలన తర్వాత అమలు చేస్తామని తెలిపారు. కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్ పనుల్లో పురోగతిపై ఆరాతీసి త్వరగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రయాణికుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని కాచిగూడ రాయచూర్ వెళ్లే రైలు సమయాన్ని మరింత ముందు వచ్చేలా చూడాలని సూచించారు. అయినాపూర్ చేగుంటవెళ్లే రూట్లో ఎన్ఐ ఆర్వోబి,మహబూబ్‌నగర్ న్యూమోతినగర్‌తో పాటు చాలా చోట్ల ఆర్వోబిలలో నీళ్ల నిందుతున్నాయి పరిష్కారం చూపాలని అన్నారు. మక్తల్ నియోజకవర్గం కృష్ణ రైల్వే స్టేషన్లో చెన్నై ముంబై (ఎస్‌పిఎఫ్) రైలు ఆపాలని ప్రతిపాదించారు. అందుకు ప్రత్తిపాదనలు పరిశీలిస్తామని రైల్వే అధికారులు తెలిపారు.



నల్ల చెరువు దగ్గర ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

### వినాయక నిమజ్జనానికి

# పకడ్బందీ ఏర్పాట్లు

## నల్లచెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా జిల్లాలో కొలువుదీరిన గణనాథులను నిమజ్జనం చేసేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఈనెల5,6 తేదీలలో నల్లచెరువు,అమ్మ చెరువులను వినాయక నిమజ్జనంకోసం అధికారులు కట్టదుట్టమైన ఏర్పాట్లుచేశారు. బుధవారం నల్లచెరువు పరిసరాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. వనపర్తి పట్టణం, వనపర్తి మండలంలో 450విగ్రహాలు ఉన్నట్లు టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఏర్పాట్ల తీరుపై మున్సిపాలిటీ డిఈ మహమ్మద్ యూసఫ్‌ను అడిగి తెలుసుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనను చోటుచేసుకోకుండా అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. చెరువులో ప్రమాదస్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమానికి కావలసిన సదుపాయాలు అన్నింటిని ఏర్పాటు చేయాలన్నారు. ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టే వారికి కావలసిన సేఫ్టీ పరికరాలను సమకూర్చాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ డిఈ మహమ్మద్ యూసఫ్, ఏఈలు, మున్సిపల్ సానిటేషన్ ఇంచార్జ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, పలువురు ఉన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

### గురుకులాల్లో భోజనం నాణ్యత

# ప్రమాణాలు పాటించాలి

## ఇటిక్యాల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఇటిక్యాల, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందించడంలో నాణ్యత ప్రమాణాలు ప్రమాణాలు పాటించి వంట గదులను విద్యార్థులు ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచాలని అలాగే పాఠశాలలో భోజనం ప్రారంభం కంటే ముందే మెస్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా సంతకాలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. బుధవారం సాయంత్రం ఇటిక్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలోని కిచెన్, స్టోర్‌రూమ్, డైనింగ్ హాల్‌లలో వసతులను పరిశీలన జరిపారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వసతి,భోజనం, శుభ్రత, భద్రతపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి – మిగతా4లో..

### తొలిముద్ద

# పాలమూరుకే..





మూసాపేట వద్ద ఎస్.జి.డి కార్నింగ్ టెక్నాలజీస్ ఫర్నేస్ లైటింగ్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- జిల్లాలో విద్య ,వైద్యం, సాగు నీటి ప్రాజెక్టులు పూర్తికి ప్రాధాన్యం
- పరిశ్రమల స్థాపనలో రాష్ట్రంలో తొలి ప్రాధాన్యం జిల్లాకే
- గ్రీన్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- పదేండ్లు పాలమూరుకు న్యాయం చేయలె
- పీజీ కళాశాలగా మిగిలిన పీయూ..
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి
- మూసాపేట వద్ద ఎస్.జి.డి కార్నింగ్ టెక్నాలజీస్ ఫర్నేస్ లైటింగ్ ప్రారంభం





మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,మూసాపేట, ఆగస్టు 3,ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో విద్య,వైద్య రంగాల తో పాటు సాగు నీటి ప్రాజెక్టల పూర్తికి ప్రాధాన్యం నిస్తూ వలసల పాలమూరు జిల్లాను అభివృద్ధి కి కలిసి కట్టుగా కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామ పంచాయతీపరిధిలో ఏర్పాటు చేసిన ఎస్.జి.డి కార్నింగ్ ఫార్మాస్యూటికల్ గ్లాస్ ట్యూబింగ్ జాయింట్ వెంచర్ ఫర్నేస్ లైటింగ్ ప్రారంభ వేడుకలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణా రావు, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహబూబ్‌నగర్‌జిల్లా నూతన పరిశ్రమలకు వేదిక కాబోతోంది అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలకు మహబూబ్ నగర్ జిల్లా వేదిక కాబోతున్నందుకు సంతోషంగా ఉందనీ చెప్పారు. ఒకప్పుడు పాలమూరు జిల్లా వలసలకు మారుపేరనీ, నాటి పాలకులు పేదరికం, వలసలు, సమస్యలను చూపించడానికి ప్రపంచ నాయకులను పాలమూరు జిల్లాను చూపించడానికి తీసుకువచ్చేదన్నారు. భవిష్యత్‌లో మనఅభివృద్ధిని, పరిశ్రమలను, యూనివర్సిటీలను, సాగునీటి ప్రాజెక్టులను చూపించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా జిల్లాను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అందుబాటులో లేకపోవడం వల్లే ఆ పరిస్థితి ఏర్పడిందనీ గుర్తుచేసారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన పాలమూరు రంగారెడ్డి,జూరాల,నెట్టెంపాడు వంటి ఏప్రాజెక్టులు సంపూర్ణంగా పూర్తి కాలేదు. ఆనాడు సోనియా గాంధీ పాలమూరు యూనివర్సిటీని మంజూరు చేసినా.. పేరుకే అది యూనివర్సిటీ.. కానీ అది పీజీ కాలేజీగానే మిగిలిపోయిందన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, ఎంప్లాయిమెంట్ లో మన జిల్లాను అభివృద్ధి చేసుకోకపోతే శాశ్వతంగా జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుంది. అందుకే ఇంజనీరింగ్, లా కాలేజీ, డిగ్రీ కాలేజీలతో పాటు ట్రిపుల్ ఐటీని పాలమూరుజిల్లాకు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక్కో నియోజకవర్గానికి రూ.200కోట్ల చొప్పున రూ. 2800 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 నియోజకవర్గాల లో 14 అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునేవిధంగా నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్య ఒక్కటే మన తలరాతలు మారుస్తుందనీ వలసలు వెళ్లే పాలమూరు బిడ్డలు ఆ వలసల బారి నుంచి బయటపడాలంటే చదువొక్కటే మార్గమన్నారు. పాలమూరు జిల్లా నుంచి ఇంజనీర్లు, డాక్టర్లే కాదు, ఐఏఎస్‌లు ఐపీఎస్‌లుగా ఎదిగి రాష్ట్రానికే కాదు దేశానికి సేవలందించేలా ఎదగాలనీ తెలిపారు. చదవాలంటే మనకు వసతులు ఉండాలి, ఆ వసతులు అందించే బాధ్యత పాలమూరు బిడ్డగా నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు.చదువు కోసం ఎక్కడ ఏది కావాలన్నా ఇవ్వడానికినేను సిద్ధంగా ఉన్నానన్నారు.పాలమూరు ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు అందించి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఉదండాపూర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని మేం ప్రయంత్నిస్తుంటే.. ప్రతిపక్షాలు గ్రీన్ – మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, వేదికపై ఎమ్మెల్యే యెన్నం

### మహబూబ్‌నగర్ అభివృద్ధిలో

# జగదీశ్వర్‌రెడ్డి అగ్రగణ్యుడు

## నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

## ఆయన ఆదర్శప్రాయుడు: ఎమ్మెల్యే యెన్నం

## నేడు పద్మావతి కాలనీలో జగదీశ్వర్ రెడ్డి విగ్రహావిష్కరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌అభివృద్ధికి కృషిచేసిన కొందరిలో సర్గీయ జగదీశ్వర్‌రెడ్డి అగ్రగణ్యుడు అని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి అన్నారు. గురువారం జగదీశ్వర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్‌లో వారి విగ్రహాన్ని రాష్ట్రమంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెక్కెరి మధుసూదన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ఎమ్మెల్సీ జగదీశ్వర్ రెడ్డి ఆదర్శప్రాయుడు అని అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి నివాసంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నాగర్ కర్నూల్ ఎంపి మల్లురవితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీశ్వర్ రెడ్డి ఎంతో సౌమ్యుడని ఆయన చెప్పారు. ఆయనతో 2004 నుంచి కూడా వ్యక్తిగతంగా పరిచయం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సందర్భంగా అప్పుడు వారు అధికార పక్షంలో ఉన్నప్పటికీ, ప్రతి పక్షంలో ఉండి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడుతున్న మాకు అన్ని విధాలా సహకరించారన్నారు. పాలమూరు యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో కూడా ఆయన నాడు చూపిన చొరవ గొప్పదని అన్నారు. మహబూబ్ నగర్ అభివృద్ధిలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మహబూబ్‌నగర్‌లో పార్టీలకతీతంగా అందరిని కలుపుకొని పోయేవారని, రాజకీయం చేసే అందరికీ ఆయన పెద్దన పాత్ర పోషించారన్నారు. ఆయన చూపిన మార్గంలో మనం నడిచి నిజమైన నివాళి అర్పిద్దామని ఆయన సూచించారు. నేడు జరిగే – మిగతా4లో..

### నీటి సంపులో పడి

# ఇద్దరు చిన్నారుల మృతి



నీటి సంపులో పడి మృతి చెందిన చిన్నారులు

**ఊట్కూర్,సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలం పరిధిలోని తిమిరెడ్డిపల్లె తండాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జయమ్మ-పునే నాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు అభి, ఆకాష్ నీటి సంపులో జారిపడి ప్రాణాలు కోల్పోయారు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబం, వినాయక నిమజ్జనానికై స్వగ్రామానికి వచ్చింది.ఇటీవల ఇంటి నిర్మాణం కోసం గ్రామంలో కొత్తగా నీటిసంపు తవ్వించగా, అందులో చిన్నారులు జారిపడినట్లు గ్రామస్థులు తెలిపారు. తల్లిదండ్రులు గమనించేలోపే వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

### తాటికుంట రిజర్వాయర్‌లో

# భార్య భర్తలు గల్లంతు

## రిజర్వాయర్‌లోకి బోటులో వెళ్ళి పరిశీలించిన ఎమ్మెల్యే,ఎస్పీ

**మల్దకల్ సెప్టెంబరు3, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం తాటికుంట గ్రామంలో చేపల వేటకు వెళ్లిన దంపతులు గల్లంతవడంతో గ్రామంలో విషాదం చాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తాటికుంట గ్రామానికి చెందిన దుబ్బోనీబావి రాముడు (40), భార్య సంధ్య (35) ఇద్దరూ తాటికుంట రిజర్వాయర్‌కు చేపల వేట కోసం వెళ్లారు. అయితే రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు.స్థానికులు వెతికినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్‌బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించాయి.ఇప్పటివరకు దంపతుల ఆచూకీ తెలియక పోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లాఎస్పీ శ్రీనివాసులు రావు సంఘటన స్థలానికి చేరుకుని రిజర్వాయర్‌లోకి బోటులో వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఈసంఘటన జరగడం చాలా బాధాకరం అని తెలిపారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుండి వారికి సహాయమందించే విధంగా కృషిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీవ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మురళి,నాయకులు ప్రభాకర్‌గౌడ్, అజమ్, చంద్రశేఖర్ రెడ్డి,అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గల్లంతైనా భార్యాభర్తలను స్వయంగా ఎమ్మెల్యే , ఎస్పీ గాలిస్తున్న దృశ్యం

### మర్రి ఓ జోకర్...!

# ఎమ్మెల్యేగా పదేళ్లు భ్రష్టుపట్టించావు

- నీకు నల్లమట్టి రెడ్డి పేరెలా వచ్చిందోచెప్పు
- ఓడిపోయిన నీవే పెద్ద పప్పువి
- నాడు జక్కాను, నన్ను, నాగంను వాడుకున్నావ్
- రేపు ఏ పార్టీలో ఉంటావో గ్యారంటీ లేదు
- కాంగ్రెస్ పార్టీలో చేరికను అడ్డుకున్నాం
- మర్రిపై ఎమ్మెల్సీ కూచుకుళ్ల ఫైర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,సెప్టెంబర్3 ప్రభాతవార్త:** రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగతంగా కించపరిచేలా విలువలు లేకుండా మాట్లాడటం సరికాదని, మర్రి జోకర్‌లా మారారని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్సీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఓ కొడుకుగా తన అభిప్రాయాలు తీసుకుంటే తప్పేంటని, తానూ ఎమ్మెల్సీనేనన్నారు. గాలికి వచ్చిన మర్రి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే డిపాజిట్ రాలేదని, తనకు 40వేల ఓట్లు వచ్చాయన్నారు. తాను ఎక్కడ,ఎప్పుడు అవినీతి చేయలేదన్నారు. మర్రి పదేళ్లు నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించారని, ప్రజల కోసం కాకుండా రియల్టరకు అనుకూలంగా పనులు చేశారన్నారు. చెరువులో కోటి రూపాయకతో మహిళా శక్తి భవనం చెరువును, ఆర్టీఏ ఆఫీసును, 14కిలోమీటర్ల దూరంలో ప్రజలకు అనుకూలంగా లేకుండా కట్టించారన్నారు. మర్రి ప్రజల అదృష్టానికి ఓడిపోయాడని, నాగర్‌కర్నూల్‌ను శ్మశానంగా చేశాడని ఆరోపించారు.ఎర్రగడ్డ, హౌజింగ్ బోర్డులో రోడ్లు తవ్వి వదిలేశారని, ప్రతి ఊరిలో పనులు మంజూరు ఇచ్చారని, పని చేయలేదన్నారు. కొల్లాపూర్ చౌరస్తా, తెల్కపల్లిలో భూ దందాలో పాత్ర ఏంటో చెప్పాలన్నారు. ఓడిపోయి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, తన కొడుకు మాస్టర్స్ డిగ్రీ, పీజీ అమెరికాలో చదివాడని, డాక్టర్‌గా సేవలు చేశారన్నారు. మర్రికి నల్లమట్టి రెడ్డి అనే పేరు ఎలా వచ్చిందో తెలుసన్నారు. వట్టెం, పోతిరెడ్డిపల్లి గుట్టల్లాంటివి అడ్డగోలుగా తవ్వారని, హైదరాబాదులో కొండకల్ భూ వివాదంలో ఉన్నారన్నారు. జీఎస్టీలో 500కోట్లు పెనాల్టీ పడిందని అన్నారు. మర్రికి మతిభ్రమించిందేమో అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నామని, తాము సీఎం రేవంత్ రెడ్డికి పార్టీలోకి వద్దన చెప్పామని, ఇటీవల ఓ మంత్రికీ కాంగ్రెస్ పార్టీలో చేరతానని అడిగాడన్నారు. తాము మర్రి చేరికను అడ్డుకున్నామన్నారు. మర్రి రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి ఉందన్నారు. మర్రికి డబ్బులున్నాయి కాని జ్ఞానం లేదని, బ్రోకర్ పని చేశారన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డిని పప్పు అంటున్నావని, మరి ఆ పప్పుతోనే ఓడిపోయావ్, నీవెంత పెద్ద పప్పువో ప్రజలకు తెలుసన్నారు. మర్రి చరిత్రలు ఇంకా చాలా ఉన్నాయి అన్నారు. రాజకీయాల్లో నాయకులు బజారులో పడొద్దని హితవు చెప్పారు. పదేండ్లు జక్కా లేకుంటే రాజకీయం నీవు చేస్తుంటివా.., జక్కాను వాడుకుంటివి వదిలేస్తివి అన్నారు. జూనియర్ కాలేజి – మిగతా4లో..

### క్రిమిసంహారక

# మందు తాగి తండ్రి మృతి

## - ముగ్గురు చిన్నారుల ఆచూకీ గల్లంతు..



మృతి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు

**వెల్దండ, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** భార్యభర్తల కుటుంబ కలహాలతో భర్త మృతి చెందడంతో పాటు ముగ్గురు పిల్లలు ఆచూకీ గల్లంతైంది. వివరాలకు వెళ్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు పెద్ద బోయలపల్లికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు(36) ఫర్టిలైజర్ వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. తన భార్య దీపికతో గొడవ జరగగా గత నెల 30వ తేదీన ఎవరికి చెప్పకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి తన బైక్ తీసుకొని తన ఇద్దరు కూతుళ్లు మోక్షిత (8) రఘువర్షిని (6), కొడుకు శివ ధర్మ (4) సంవత్సరాలు కలిసి బైక్ పై తీసుకెళ్లాడు. ఎంత వెతికినా దొరకకపోవడంతో ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్లోలో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల పెద్దాపూర్ గ్రామ సమీపంలో బుధవారం పోలే జంగయ్య పొలంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి ఎస్సై కురుమూర్తి చేరుకొని పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బైక్‌పై ఉన్న అటాచ్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు చేరుకొని చనిపోయిన వ్యక్తిని మా కుటుంబ సభ్యుడిని గుర్తించినట్లు శవం కొద్దిగా కూలిపోయినట్లు ఇంటి దగ్గర నుంచి తీసుకొచ్చిన పిల్లల ఆచూకీలభ్యం కావడం లేదని మృతుని తమ్ముడు గుత్తా మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆర్ఆర్ టాక్స్

# ఏంటో నిగ్గుతేల్చాలి

- 20 నెలలు టైం,డబ్బులు వృధా..
- ఏమి చేయలేకే సిబిఐకి అప్పగింత
- కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎవరితో విచారణ చేయించినా మీ ఇష్టం
- కాంగ్రెస్ బిజెపి ఒక్కటై డ్రామాలు..
- బిఆర్ఎస్ వై పై ప్రజలు మీడియా సమావేశంలో

మాజీ మంత్రి, బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

**జడ్చర్ల సెప్టెంబర్3 ప్రభాతవార్త:** కాళేశ్వరం కమిషన్ అంటూ 20 నెలల తర్వాత తీరా ఏం చేయలేక సి.బి.ఐకి అప్పగించడం ఏంటని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు.మహబూబ్‌గర్ జిల్లా – మిగతా4లో..



మాట్లాడుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## వయో వృద్ధులకు పెన్షన్లు మంజూరు చేయాలి

**ఉప్పునుంతల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వయో వృద్ధులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు, వికలాంగులు గత ఎనిమిది సంవత్సరాల నుంచి పెన్షన్లు కొత్తగా మంజూరు చేయకపోవడం, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం




ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెన్షన్ల వెబ్సైట్లు ప్రారంభించాలని, వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ ఎంపిడిఓ మోహన్‌లాల్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజుతో పాటు కేసుముల్ల సైదులు, వెంకట్రాం నాయక్, వెంకటయ్య, మహిళలు లలిత, శివరాణి, సుగుణమ్మ, పార్వతమ్మ, లక్ష్మమ్మ, రేణుక, అలివేలు, నరసమ్మ, నిరంజన్, కెవిపిఎస్ మండల నాయకులు పాతుకుల కొండల్, సున్నం కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన మండల మహిళా సమాఖ్య

**ఉప్పునుంతల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** ఇందిరా క్రాంతి పథకం ఉప్పునుంతల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అచ్చంపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి హాజరైన మండల మహిళా సమైక్య సభ్యులు, ఐకెపి సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. సన్మానించిన వారిలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ, కార్యదర్శి సునీత, ఐకెపి ఎపిఎం బాలచందర్, సీసీలు శ్రీనివాస్, భాస్కర్, పద్మావతి, రాజు, వివోఏలు, మండల మహిళా సంఘం సభ్యురాలు, గ్రామ ఐక్య సంఘాల సభ్యులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉప్పునుంతల మండల మహిళా సమాఖ్య సభ్యులు

## నారాయణపేట కొండారెడ్డి పల్లి చెరువును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణపేటటౌన్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం సమీపంలోని కొండారెడ్డిపల్లి చెరువును బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి బుధవారం సందర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో కొండారెడ్డిపల్లి చెరువును అత్యంత అందంగా తీర్చిదిద్ది వినాయక నిమజ్జనాలకు, బతుకమ్మ నిమజ్జనాలకు ప్రజలకు అందుబాటులో తీసుకొని రావడం జరిగిందన్నారు. అదేవిధంగా మరో నాలుగు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపి విధులు కూడా తీసుకొని రావడం జరిగిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నాలుగు కోట్ల నిధులు వెనక్కి వెళ్లాయని అన్నారు. ప్రస్తుతం చెరువు మెయింటెనెన్స్ కూడా సరిగా చేపట్టడం లేదని ఆరోపించారు. చెరువు వద్ద కనీసం లైట్లు కూడా లేవని, ఉన్న సీసీ కెమెరాలు కూడా తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత వినాయక నిమజ్జనం అదేవిధంగా రానున్న బతుకమ్మ నిమజ్జనాలను పురస్కరించుకొనైనా మున్సిపాలిటీ అధికారులు చెరువు వద్ద చెత్తాచెదారాన్ని తొలగించి అక్కడ ఉన్న లైట్లు వెలిగించేలా చూడాలని కోరారు. చెరువు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు శాఖ చెరువు ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ కంట్రోల్ రూమ్ కు కనెక్ట్ చేసుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తద్వారా చెరువు వద్ద మందుబాబుల సీసాల పగలగొట్టడం వంటి సంఘటనలు జరగనివ్వకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



చెరువును సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

## సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలి

**దామరగిద్ద, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని 5వ వార్డు యాదవ (గొల్ల)గేరిలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, జిల్లా కమిటి సభ్యులు జోషి ఆధ్వర్యంలో సిపియం బృందం స్థానిక సమస్యలపై సర్వే చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో యాదవ వార్డు5లోని రోడ్లు ,మురికి కాల్వల సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా నాయకులు మేం అధికారంలోకి రాగానే వార్డులో రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం తప్పకుండా చేపడుతామని అమాయక ప్రజలను నమ్మించి ఓట్లేసుకొని మోసం చేస్తున్నారని అన్నారు. వర్షాకాలం మురికి నీటి వల్ల దోమలు, ఈగల నుండి మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడి ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వార్డులో ఇరుకు రోడ్ల వల్ల ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ లు రాలేక మెయిన్ రోడ్డునుండి పంట గింజలు ,ఇంటి నిర్మాణం కోసం ఇసుక, కంకర మోసుకోవాల్సి వస్తుందని అన్నారు. వార్డులో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపియం గ్రామ కార్యదర్శి కనకప్ప, మహేష్, ఉసేనప్ప, చంద్రశేకర్, దేవందర్, శ్రీనివాస్, గోవింద్, శ్రీను, చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సిపిఎం నాయకులు

## గ్రిల్స్ ఏర్పాటుకు లక్ష రూపాయల చెక్కును అందచేసిన రాజ్ కుమార్ రెడ్డి

**నారాయణ పేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీదేవి దేవాలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె రాజ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక లక్ష రూపాయల చెక్కును దేవాలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయం నిర్మాణం పూర్తి అయినప్పటికీ చుట్టూ రక్షణ గ్రిల్స్ లేకపోవడంతో అనేకసార్లు దుండగులు చొరబడి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ సమస్యను వివరించిన వెంటనే రాజ్ కుమార్ రెడ్డి స్పందించి గ్రిల్స్ ఏర్పాటుకు సహాయం అందించారని పేర్కొన్నారు. అదనంగా భద్రత కోసం ఆలయంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయించినట్టు వెల్లడించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువాతో రాజ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గణపయ్యకు ప్రత్యేక పూజలు చేసిన రాజ్ కుమార్ రెడ్డి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మరికల్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండపాన్ని రాజ్ కుమార్ రెడ్డి సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండప నిర్వాహకులు ఆయనకు శాలువాతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రాజేష్, వెంకటరాం రెడ్డి, రామస్వామి, జైపాల్ రెడ్డి, కృష్ణయ్య, హరీష్, సురేష్, మల్లేష్ , రాములు, రఘు, శ్రీను, సత్యరెడ్డి వినాయక మండప నిర్వాహకులు ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

## పాఠశాలలను సందర్శించిన మండల విద్యాధికారి

**ఉప్పునుంతల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక బాలుర, బాలికలపాఠశాలను బుధవారం మండల విద్యాధికారి చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీచేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమయ పాలన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రవేటు పాఠశాలకు ధీటుగా విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ సందర్శించిన పాఠశాలలో బాలుర పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులుతో విద్యార్థుల హాజరు, ప్రగతి పట్ల ఆరా తీశారు. ఎంఇఓ చంద్రశేఖర్ తో పాటు బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉప్పునుంతల బాలుర పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఓ చంద్రశేఖర్

## తెలంగాణ పచ్చబడింది అంటే దానికి కారణం కాళేశ్వరం

### ఆ ఘనత ఒక కేసీఆర్‌కి దక్కుతుంది.. పెబ్బేరు మండల టిఆర్ఎస్ నాయకులు

**పెబ్బేరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీ లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు పై విచారణను సిబిఐకి అప్పగించినందుకు బుధవారం రోజు స్థానిక సుభాష్ చౌరస్తాలో బిఆర్ఎస్ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్ అసమర్ధ పాలనలో చంద్రబాబు మెప్పుకోసం కాళేశ్వరం ప్రాజెక్టు పైన కుట్రలు చేసి మొత్తం గోదావరి జలాలను ఆంధ్రకు తీసుకెళ్లే కుట్ర జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను బదనాం చేయాలనే కాంగ్రెస్ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. కెసిఆర్ జోలికొస్తే తెలంగాణ అగ్నిగుండమే తెలంగాణ వర ప్రధాని అయిన కాళేశ్వరంపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపడ్డారు 50 ఏళ్లు పాలించిన మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో వలసలు, కన్నీళ్లు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు అసలు మీ బాధ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినందుకు..? తెలంగాణ ప్రజల నీళ్ళు ఇచ్చినందుకు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కేసిఆర్ అనే మహా వ్యక్తి లేకపోతే నువ్వు సీఎం అయ్యేటోడివా ఆలోచించుకో. తెలంగాణ సాధించిన కెసిఆర్ కృష్ణానదిపై పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మించి 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందే విధంగా గోదావరి నదిపై రికార్డు స్థాయిలో మూడు ఏళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి 70 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తెలంగాణను చేశారని అటువంటి మహానాయకులపై 94 వేల 300 కోట్లు ఖర్చు పెడితే కెసిఆర్ ఏ లక్ష కోట్లు దోచుకున్నారని కమిషన్ వేసి రేవంత్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు వనం రాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణ శ్రీ సాయినాథ్, నాయకులు కర్రెస్వామి, పార్వతి, ఎల్లారెడ్డి, మేకల ఎల్లయ్య, హరి శంకర్ నాయుడు, సహదేవుడు, సాయి రెడ్డి, ఎల్లారెడ్డి, రాజశేఖర, వెంకటేష్, విశ్వరూపం, మధు, వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ చౌరస్తాలో ధర్నా నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు

## 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పనిముట్లు

### 10లోగా రైతులు దరఖాస్తులు చేసుకోవాలి: ఏవో రవికుమార్

**ఇటిక్యాల సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :** వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా 2025 వ సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం సన్న చిన్న కారు రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పనిముట్లను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. ఇటిక్యాల మండలానికి 12 లక్షల 30 వేల రూపాయలు తో 157 వివిధ రకాల యూనిట్లు మంజూరు అయ్యాయి. బ్యాటరీ స్ప్రేయర్లు 114 ఒక్కొక్కటి సబ్సిడీతో వెయ్యి రూపాయలు. తైవాన్ స్ప్రేయర్లు 24. సబ్సిడీతో ఒక్కో దానికి 10వేల రూపాయలు. రోటోవేటర్లు 6 సబ్సిడీపై ఒక్కోదానికి 50, వేలు. కల్టివేటర్లు ఎంపీప్లవ్ కేజీ వీల్ 7 రాయితీపై ఒక్కదానికి 20,వేలు. పవర్ వీడర్లు 1 సబ్సిడీతో 35వేలు. బ్రష్ కట్టర్లు 2 రాయితీపై ఒక్కో దానికి 35వేలు. సీడ్ కం పర్టీ లేజర్ డ్రిల్ 1 సబ్సిడీతో 30,వేలు. పవర్ టిట్లర్లు 1 రాయితీతో ఒక్క లక్ష. వరి గడ్డి కట్టలు కట్ట యన్త్రం 1 రాయితీతో 2 లక్షలు ప్రకారం ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎర్రవల్లి మండలంలో 15 గ్రామ పంచాయతీలకు గాను 11 లక్షల 60 వేల రూపాయలతో 156 వ్యవసాయ యంత్రాల పనిముట్లు మంజూరు అయినట్లు ఏవో రవికుమార్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు 114 సబ్సిడీపై ఒక్కోదానికి వెయ్యి రూపాయలు. తైవాన్ స్ప్రేయర్లు 24. ఒక్కో దానికి సబ్సిడీపై 10వేలు. రోటోవేటర్లు 5. రాయితిపై 50.వేలు ఒక్కోదానికి. కల్టివేటర్ ఎంబి ప్లవ్ కేజీ వీలులు 8. రాయితీపై ఒక్కో దానికి 20,వేలు. పవర్ వీడర్లు 1. రాయితీపై ఒక్కోదానికి 30,వేలు. బ్రెష్ కట్టర్లు 1. రాయితీపై 35 వేలు. సీడ్ కం పార్టీ లైజర్ డ్రిల్ 1. రాయితీపై 30 వేలు. పవర్ టిట్లర్లు 1. రాయితీపై ఒక లక్ష. వరిగడ్డి కట్టల కట్టే యంత్రం 1. రాయితీపై 2 లక్షలు ప్రకారం రైతులకు ప్రభుత్వం అందజేస్తున్నట్లు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పనిముట్లు కావలసిన రైతులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని భూమి పాస్ పుస్తకం. ఆధార్ కార్డు. ట్రాక్టర్ కు సంబంధించిన పనిముట్ల కోసం ట్రాక్టర్ ఆర్ సి పుస్తకం. వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని ఇతర సమాచారం కోసం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులు సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు..



మండల వ్యవసాయ అధికారి రవికుమార్

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా నూతన రెడ్ క్రాస్ పాలక మండలి సభ్యులు

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా పాలకమండలికి ఎన్నికైన నూతన జిల్లా చైర్మెన్ సంగాల అయ్యపు రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు, కలెక్టర్ బి.ఎమ్. సంతోష్‌ను మర్యాదపూర్వ కంగా కలిసి శాలువతో సత్కరించారు. మూడు సంవత్సరాల పదవీ కాలానికి ఎన్నికైన ఈ కార్యనిర్వహక సభ్యులు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనుటకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. చాలా సంవత్సరాలుగా కోరుతున్న రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయం, రక్తనిధి కేంద్రం , ఈ మధ్యనే మంజూరు కాబడిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ స్థల విషయంలో కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన పాలకమండలి వారిని గౌరవిస్తూ మీరు చేసే అన్ని కార్యకమాలకు నాసంపూర్ణ సహకారం ఉంటుందని, రెడ్ క్రాస్ స్థల కేటాయింపు, డే కేర్ సెంటర్ భవన సదుపాయాల విషయంలో తన సం పూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులైనా అధనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రెడ్ క్రాస్ సొసైటీ భవిష్యత్తు కార్యచరణను వివరించి వారి సహాయ సహకారాల గురించి చర్చిం చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు రమేష్, సొసైటీ ఉపాధ్యక్షులు తాహిర్, కోశాధికారి ధనలక్ష్మి, కార్యనిర్వాహక సభ్యులు అప్సర్ భాష, గంగాధర్ గౌడ్, చాగాపురం లక్ష్మీనారాయణ గౌడ్, అక్బర్ బాషా, నల్లారెడ్డి, బందారి పాల్ సుధాకర్, బస్సు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ నూతన కమిటీ సభ్యులు

## నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు

### రైతులకు ఎకరాకు రూ. 35 లక్షలు ఇచ్చి ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యే ఎస్ ఆర్ రెడ్డి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని, ఈపథకంవల్ల భూములు కోల్పోతున్న రైతులు కోరుతున్నట్లుగా ఎకరానికి 35 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో నారాయణపేట జిల్లాలోని మక్తల్, ఉట్కూర్, నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్ మండలాలకు మాత్రమే ప్రయోజనం కలిగి మిగతా మండలాలకు చుక్కనీరు రానప్పటికీ బిఆర్ఎస్‌పార్టీ ఈ ప్రాజెక్టుకు అడ్డు చెప్పడం లేదని, అదే సందర్భంలో నారాయణపేట జిల్లాలోని అన్ని మండలాలకు ప్రయోజనం కలిగే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తిచేస్తే జిల్లా మొత్తం సస్యశ్యామలమవుతుందని అన్నారు. ఇప్పటికే 95పూర్తయిన పాలమూరు కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతులకు ప్రలోభాలకు గురిచేసే ఉత్తి మాటలను కట్టబెట్టి ఇతర నియోజకవర్గాల్లో రైతులకు ఇచ్చి మాట నిలబెట్టుకొని ఆదుకోవాలని కోరారు. కవిత సస్పెన్షన్ ను స్వాగతిస్తున్నాం :బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ ను నారాయణపేట జిల్లా పార్టీ స్వాగతిస్తుందని జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీఎమ్మెల్యే అన్నారు. బుధవారం ఇటీవలకాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికి నష్టం కలిగించేలా ఉన్నాయనీ గుర్తించిన అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్థూ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారనీ తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కుటుంబపార్టీ అని పదేపదే చెప్పుకునే కాంగ్రెస్, బిజెపిపార్టీలకు కవిత సస్పెన్షన్ ద్వారా ఇది కుటుంబపార్టీ కాదనే విషయం కనువిప్పు కలుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఒక క్రమశిక్షణ గల పార్టీయని, ఇందులో తప్పు చేసిన వాళ్ళు ఎంత పెద్ద వాళ్ళు అయినా సరే పార్టీ నుంచి పక్కకు తప్పించడం జరుగుతుందనే విషయం కవిత సస్పెండ్ నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఇకపైన ఎవరు కూడా పార్టీ ఆదేశాలను దాటి ప్రవర్తించరాదని తెలిపారు.

## భూత్పూర్‌లో ఘనంగా వినాయక ఉత్సవాలు

-పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు,ప్రత్యేక పూజలు

-వినాయకులను వేర్వేరుగా దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్,మాజీ ఎమ్మెల్యే ఆల

-మండలంలో పలు వినాయకుల నిమజ్జనం నేడు



నాల్గోవార్డులో ప్రతిష్టించిన వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త :** వినాయక ఉత్సవాలు భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో కన్నుల పండువగా జరుగుతున్నాయి. అగస్టు 27న ఎంతో ఆర్భాటంగా వినాయక చతుర్థి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. మిరుమిట్లు కొలిపే వినాయక మండపాలలో గడిచిన గడిచిన ఆరురోజులుగా విభిన్న రూపాలలో లంబోధరుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్త బృందాలు వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక భజనలు, యజ్ఞాలు, హోమాలు నిర్వహిస్తూ విఘ్నేశ్వరుని కృపకు పాత్రులౌతున్నారు. భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతా లలో తొమ్మిదో రోజైన గురువారం గణేశులు జలప్రవేశం చేయనున్నారు. భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని పదివార్డులలో వినాయక మండపాల ఏర్పాటుకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఒక్కో మండప నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయంగా రు.30వేలు ఉదారంగా అందించి గణపతిదేవుడి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. అన్నదానాలు నిర్వహిస్తున్న పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ తోపాటుమండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మాల్లో కాంగ్రెస్ నాయకులు లిక్కివిజయ్ గౌడ్, బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, గడ్డం యాదయ్య, బజార్ పరుశురాం, మునిస్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

**విఘ్నేశ్వరుని వేర్వేరుగా దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల**

నాల్గోవార్డు ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్. మాజీ ఎమ్మెల్యే ఆల వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తో పాటు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్. బీఆర్ఎస్ నుంచి పార్టీ మండల అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సత్తూర్ సురేష్‌గౌడ్‌తో పాటు పార్టీనాయకులు సత్తూర్‌నారాయణగౌడ్, టి మురళీధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, మనెమోని సత్య నారాయణ, సత్తూర్ అశోక్‌గౌడ్, వడ్ల బ్రహ్మయ్య, గొడుగు వెంకటరాజు, పులగుర్ల మల్లేష్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.

**సంజీవరాయ దేవస్థానం వద్ద అన్నదానం**

భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులోని సంజీవరాయ దేవాలయం వద్ద బుధవారం సంజీవరాయ యువజన సంఘం సభ్యుడు గొడుగు నాగరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం ఇతర సభ్యులు అర్వ విజయ్‌కుమార్, తోక శివశంకర్, జశ్వంత్, చందు, పార్థసారథి, లోకేష్, సోమేష్, నివేద్, నిహాల్, నిశిద్‌లతోపాటు జర్నలిస్టులు ముడావత్ శంకర్, గొడుగు వెంకటయ్య పాల్గొన్నారు.

## స్వర్గీయ డా. కొత్త చిన్న జంగి రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల బిసి కాలనీ(తూర్పు)లో స్వర్గీయ డా. కొత్త చిన్న జంగి రెడ్డి జ్ఞాపకార్థం బుధవారం రాత్రి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్త యశోదఫంక్షన్‌హాల్ ప్రొ॥ స్వర్గీయ డా. కొత్త చిన్న జంగి రెడ్డి ప్రతి సంవత్సరం వినాయక చవితి పర్వదిన సందర్భంగా బీసీ కాలనీలో అన్నదానకార్యక్రమం నిర్వహించేవారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో జ్ఞాపకార్థం గా శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు చేయూత

**నవాబుపేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబానికి అండగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్థిక సాయంచేశారు. మండలపరిధిలోని చౌదూర్ గ్రామం, రంగంపల్లి కీ చెందిన చక్కటి బాలరాజు (38) ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఎండి హైమద్ మరియు కాంగ్రెస్ యువనాయకుడు ఎండి అసిఫ్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 5100ల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబీకులకు కాంగ్రెస్ యువనాయకుల ద్వారా అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంక లక్ష్మయ్య, చక్కటి తిరుపతయ్య, చక్కటి వెంకటేష్, వై. శ్రీను, బొర్రాజంగమ్మయ్యలు కాంగ్రెస్ సీనియర్ యువ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ కోసం ఒక మొక్క నాటిన విద్యార్థులు



అమ్మ కోసం ఒక మొక్క నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పెబ్బేరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం వై. శాఖపురం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి అమ్మ కోసం ఒక మొక్క ప్రతి ఒక్కరు తమ తల్లి పేరుతో నాటాలని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, సురేషు, జయప్రకాష్, శ్రీనివాసులు, ఖయుమ్, రామచంద్రి, బి విజయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వీరసముద్రం చెరువుకు ప్రత్యేక పూజలు

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని తాటిపాముల గ్రామంలోని వీర సముద్రం చెరువుకు ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, వాగు నుంచి వస్తున్న నీటితో జలకల సంతరించుకొని అలుగు పారడం వల్ల సాంప్రదాయం ప్రకారం బుధవారం వీర సముద్రం చెరువు గంగమ్మ తల్లికి గ్రామ పెద్దలు, మత్స్యకారులు, యువకులు, మాజీ ఎంపిటిసి వెంకటయ్య నాయుడు ప్రత్యేక పూజలు చేసి చెరువులో ఉర్ధ పాసెం, పుస్తెమెట్టలను వదిలారు.

## మానసిక ఆరోగ్య కార్యక్రమం




విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డా. పుష్పలత

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య నిపుణురాలు డా. పుష్పలత, పీహెచ్ డా. రాముడు, జిల్లా మానసిక ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినిలకు మానసిక స్థితిపై పరీక్షా విధానం పెట్టడం జరిగింది. పరీక్షలో కొంత మంది విద్యార్థినీలకు వారి మానసిక స్థితిపై వారు రాసిన జవాబులపై మానసిక ఆరోగ్య బృందం ప్రతి ఒక్కరికి విడివిడిగా మానసిక కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఉపాధ్యాయినీలు పాల్గొనడం జరిగింది.

## నేడు పేటలో విద్యుత్ అంతరాయం

**నారాయణపేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో నేడు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లా కేంద్రంలో ట్రీ కటింగ్, గణేష్ నిమజ్జనం సందర్భంగా మున్సిపల్ శాఖ తరఫున ప్రతి విద్యుత్తు స్తంభానికి విద్యుత్ ప్లగ్ లు అమర్చుతున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ మహేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కె.వి ఉప కేంద్రంలో ఉన్న సివిల్ లైన్ చిల్డ్రన్ హాస్పిటల్ వీ.ఐ.పి ఫీడర్ యాదగిరి రోడ్డు సత్యసాయి ఫీడర్ లలో తీగల వెంబడి ట్రీ కటింగ్ చేయనున్నందున పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. ప్రజలు, వ్యాపారస్తులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే



**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని చౌక్ బజార్ ఫ్రెండ్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పట్టణ కమిటి సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## మర్రి అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**బిజినేపల్లి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి భేషరతుగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని, మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మచ్చలేని ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలపై విమర్శలు చేసే ముందు ఒకసారి ఆలోచించుకోవాలని హితవుపలికారు. నియోజకవర్గంలో పదేళ్లపాటు ల్యాండ్, సాండ్ మాఫియాగా పేరు గడించిన వారు ఎవరో ఈ ప్రాంత ప్రజలకు తెలుసని చెప్పారు. విజ్ఞత విజ్ఞానం లేకుండా ఎలా పడితే అలా మాట్లాడితే ప్రజలు చీకొడతారని హితవు పలికారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలను ప్రజలకు చేరుస్తూ పేదలకు అండగా ఉంటున్న ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. తన పరిపాలనలో ఒకే సామాజిక వర్గానికి కొమ్ము కాసి అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేని తనంతో దిగజారుడు వ్యాఖ్యలుచేయడం మంచిపద్ధతి కాదన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వంలో లోపాలు ఉంటే ప్రజల మద్దతుతో ప్రశ్నించాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే లోపాలను ఎత్తిచూపాలని అప్పుడే ప్రజల మన్ననలను పొందగలుగుతారని అన్నారు. ప్రజా పరిపాలనలో ప్రజాసేవకే అంకితమై పనిచేస్తున్న ఎమ్మెల్యేపై మరోసారి వ్యక్తిగత దూషణలకు పోతే కాంగ్రెస్ కార్యకర్తలు తిరగబడతారని గుర్తుపెట్టుకోవాలి అన్నారు. సమావేశంలో మిద్దె రాములు, మలిశెట్టి వెంకటస్వామి,అమృత్‌రెడ్డి,తిరుపతయ్య,రామచందర్, పరశురాములు,రాములు, బంగారి పర్వతాలు, ముక్తార్, వాల్య, నరేందర్‌గౌడ్, బాలరాజ్ పాషా, ఖలీల్, శ్రీకాంత్, కిజర్ పాల్గొన్నారు

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి

### డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, సెప్టెంబరు3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని లైన్ వాడ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణనాథుడిని జిల్లా డీఎస్పీ నల్లపు లింగయ్య సందర్శించారు. అనంతరం మండప నిర్వాహకులతో భద్రతా అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా



డీఎస్పీని సన్మానిస్తున్న గణేష్ మంటప నిర్వాహకులు

డీఎస్పీ మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద నిర్వా హకులు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ బృందాలు పాయింట్ బుక్స్ తనిఖీ చేసినప్పుడు వారికి సహకరిం చాలని మండపాల దగ్గర దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. అలాగే సాయంత్రం వేళ గణేష్ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చూడాలని మహిళల పట్ల గౌరవంపాటించాలన్నారు. శోభాయాత్రలలో డీజేలు వినియోగించరాదు అని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్‌బాక్స్‌లుఆపాలని సమీపకాలనీ ప్రజలకుఎలాంటి ఇబ్బందులు కలగ కుండాచూడాలని మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఉత్సవాలను ప్రజలంతా సంతోషంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ నల్లపులింగయ్య ఆకాంక్షించారు.

## క్షుద్ర పూజలతో కలకలం

### ◆ భయాందోళనలో గ్రామస్తులు

**మద్దూర్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూర్ మండల పరిధిలోని క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. నిడ్జింత గ్రామ శివారులో ఉన్న ఓ వాగులో గుర్తు తెలియని బాబాలు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఈ క్షుద్ర పూజలు చూసిన కొందరు యువకులు మీడియాకు సమాచారం అందించారు. ఈ పూజలతో గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న విజ్ఞాన దర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ బుధవారం ఘటన స్థలానికి చేరుకొని క్షుద్ర పూజలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈక్షుద్ర పూజలకు గ్రామస్తులు, యువకులు ఎవరు భయపడవద్దని సూచించారు. కొంతమంది దొంగ బాబాలు తమ జేబులు నింపుకోవడానికి, అమాయక ప్రజల దగ్గర వేలకు వేలు వసూలు చేస్తూ, ఇలాంటి పూజలు నిర్వహించి,ప్రజలను మోసం చేస్తున్నారని గ్రామస్తులకు తెలిపారు. ఇలాంటి దొంగ బాబాల మాటలు విని ప్రజలు ఎవరు మోసపోవద్దని సూచించారు. గ్రామ ప్రజలకు భయం తొలగించడానికి క్షుద్ర పూజలు చేసిన నిమ్మకాయలతో రసం, శరభత్ చేసుకొని ఆయన తాగారు. ఏమైనా చేతబడులు చేయాలనుకుంటే నాకు చేయండి అని సవాలు చేస్తూ ఈ అమాయక ప్రజలను మోసం చేయవద్దనిదొంగ బాబాలకు ఆయన హెచ్చరించారు. ఇలాంటి దొంగ బాబాల మాటలు విని మోసపోవదని, ప్రజలు మూఢనమ్మకాలను ఎవరు నమ్మవద్దని గ్రామస్తులకు, యువకులకు తెలిపారు..అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మూఢనమ్మకాల చట్టాన్ని చేసి ఇలాంటి వాటిని అరికట్టాలని కోరారు.

## కొనసాగుతున్న మహాగణపతి బ్రహ్మోత్సవాలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 3 ప్రభాత వార్త:** నారాయణపేట పట్టణం శక్తి పీఠం ఆధ్వర్యంలో మహా గణపతి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారము భాద్రపద శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని మహాగణపతికి ఉదయం విశేష పంచామృత అభిషేకం మరియు కరవీర పత్రార్చన, వీర గణపతి హవనములను ప్రముఖ కృష్ణయజుర్వేద స్మార్త పండితులు, ఉట్కూర్ విభావసు పురోహిత్ అగ్నిహోత్రం తదితర కార్యక్రమములను నిర్వహింపజేశారు.తదుపరి శక్తిపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి శాంతానంద పురోహిత్ భక్తులందరికీ ఆశీర్వాద ములను అందించారు. సాయంత్రం బ్రహ్మశ్రీ గంగాపురం రామకృష్ణ శర్మ విచ్చేసిన భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు శక్తిపీఠం వ్యవస్థాపకులు తదితరులు ఉన్నారు.



కొనసాగుతున్న మహాగణపతి బ్రహ్మోత్సవాలు

## మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు బుధవారం మండల వనరుల కేంద్రం ఉప్పునుంతల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,ఉన్నతి కార్యక్రమం 6వ నుంచి 9వ తరగతుల వరకు అంశాలను విశదీకరించారు. ఎస్ఎస్‌సి ఫలితాలు, రాబోయే విద్యా సంవత్సరం2025-26 ఎస్ఎస్‌సి కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు.కొత్త ప్రైమరీ పాఠశాలల ప్రారంభం, ప్రీప్రైమరీ విభాగాల ఏర్పాటు, జీరో ఎన్‌రోల్మెంట్ పాఠశాలలు ఈ సంవత్సరం ప్రారంభం కాని కారణాలు, ముఖ గుర్తింపు హాజరుపై చర్చించారు. అలాగే ఆరోగ్య పరీక్షలు, మధ్యాహ్న భోజనం ఆహార నమూనా సేకరణపై అధికారుల దృష్టి సారించారు.తదుపరి భవితా సెంటర్లు, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాల్లా వాడకం, యు డైస్ 2024లో మౌలిక సదుపాయాల లోటు విషయాలు ప్రస్తావించబడ్డాయి. టాస్ ఉల్లాస్, ఉపాధ్యాయ శిక్షణ, పని సర్దుబాటు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ఇన్స్పైర్ మానాక్ ఉపాధ్యాయ పురస్కారాలు వంటి అంశాలు సమావేశంలో చర్చించారు.అలాగే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ యూనిఫార్మ్, ఆన్‌లైన్ స్థితి,హెచ్‌ఎంల పాఠశాలల సందర్శనలు, ఐఎఫ్‌పి, ఇంటర్నెట్ కనెక్టివిటీ అంశాలపై సమీక్ష జరిపారు. పీఎం శ్రీపాఠశాలలు, వనమహోత్సవం, కస్తూర్బా గాంధీ విద్యాలయం, భవితా సెంటర్లు,ఆధార్ ధృవీకరణ, యూడైస్‌ఈ నవీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ తో పాటు జిల్లా హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్యతో పాటు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

# నేర రహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం

**ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం**
**వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్**
**సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులను అభినందించి సన్మానించిన ఎస్పీ**



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

**పెబ్బేరు, సెప్టెంబరు3ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం అయ్య వారి పల్లి, తిప్పాయిపల్లి, గ్రామాలలో గ్రామస్తులు,గ్రామ రైతుకమిటీ, మహిళ సంఘాల సహకారంతో ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన 18 అధునాతన సీసీ కెమెరాలను పెబ్బేరు మండలం అయ్యావారిపల్లి (12),తిప్పాయపల్లి (06) గ్రామాలలో గ్రామ పంచాయితీ ప్రభుత్వ భవనాలలో సీసీ కెమెరాలను వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని,సీసీ కెమెరాలు 24 గంటల నిరంతరం పనిచేస్తాయని తెలిపారు.జిల్లాలో నేరాల అదుపు చేయడానికి పోలీసులతోపాటు ప్రజలను,స్వచ్ఛంద సంస్థలను, గ్రామ రైతు కమిటీ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పోలీసులసహకారంతో అయ్యావారిపల్లి,తిప్పాయపల్లి గ్రామాలలోనే కాకుండా ఈ పెబ్బేరు మండలంలో మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరి సహకారం అవసర ముంటుందని తెలిపారు.జిల్లాలో నేరాలు నిర్మూలించడానికి,ఎలాంటి అల్లర్లు జరగిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించి నిందితులను అరెస్టు చేయడం జరుగుతుందని అయ్యావారిపల్లి, తిప్పాయిపల్లి, గ్రామాల నుండి కాకుండా వనపర్తి కమాండ్ కంట్రోల్ నుండి వీక్షించడం జరుగుతుంది అని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామస్తులను ఎస్పీ అభినందించి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. వీరిని ఆదర్శంగా తీసుకొని జిల్లాలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ తమ నివాస ప్రదేశాల్లో అర్ధరాత్రి వేళల్లో ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలనికోరారు.తెల్లవారుజామున ఇండ్లముందు వాకిలి శుభ్రం చేసేటప్పుడు, రోడ్లపై వాకింగ్ చేసే సమయాల్లో బంగారు ఆభరణాలను ధరించరాదని సూచించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.దొంగతనాల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు పోలీసు వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. తిప్పాయిపల్లి గ్రామం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని సందర్శించారు.ఆనందోత్సవాల మధ్య వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించుకోవాలని యూత్ సభ్యులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై యుగంధర్‌రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తిప్పాయిపల్లి మాజీ సర్పంచ్ రమాదేవి మహేశ్వరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ చెన్నయ్య, అయ్యావారిపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, అయ్యావారిపల్లి గ్రామ పోలీసు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, తిప్పాయి పల్లి గ్రామపోలీసు అధికారి ఆంజనేయులు, గ్రామస్తులు, యువకులు , ప్రజా ప్రతినిధులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలకు కృషి చేసిన ఎస్ఐని సన్మానించిన ఎస్పీ

# గ్రామాల అభివృద్ధే నా లక్ష్యం

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**నవాబుపేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్దే తన ధ్యేయం అని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నవాబుపేట మండల పరిధిలోని కొల్లూరు నుండి బటోనిపల్లి తాండవరకు 2 రెండు కోట్ల 5లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎనుమనుగండ్లలో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసి నూతన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. లోకిరేవు, లింగంపల్లిలో మాజీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి,మండల కాంగ్రెస్‌నాయకుల ఆధ్వర్యంలో గడపగడపకు తిరిగి రేషన్ కార్డులు అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు కూడా అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.ప్రతీ గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామన్న ఆయన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని, నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలోమండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్, పంచాయతీ కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీరటి రామచంద్రయ్య, మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, వాసు యాదవ్,యువజన అధ్యక్షులు నీలకంఠం,మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ఖజామైనుద్దీన్, గుండేటి యాదయ్య, నరేష్,హమీద్, మహేక్, కోస్గి రాజు, నరసింహ, సత్యనారాయణ గౌడ్,ఆర్సిపూర్ బాలస్వామి,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు3 ప్రభాతవార్త:** తనకి ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మైనర్ బాలిక 100కు సమాచారం ఇవ్వడంతో బుధవారం పోలీసుల సమాచారం మేరకు నెల్లికొండి గ్రామానికి మండల తహసిల్దార్ ఎల్లన్న, ఆర్ఐలు తిరుపతయ్య, అమీర్‌తో పాటు ఐసిడిఎస్ అధికారులు గ్రామంలోని మైనర్ బాలిక ఉంటున్న అద్దె ఇంటికి చేరుకొని గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు.నర్వ మండలం కుమార్ లింగంపల్లి గ్రామానికి చెందిన చందన అలియాస్ చంద్రకళ అనే మైనర్ బాలిక ఆగస్టు 2011 సం.లో జన్మించిందని ఈ మైనర్ బాలిక ఏడవ తరగతి వరకు కుమార్ లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రికార్డులో ఉందని అధికారులు తెలిపారు.మైనర్ బాలిక తన తల్లి ఎస్.బాలమణితో కలిసి నెల్లికొండి గ్రామంలో నివాసముంటున్నారు. తనకు ఇష్టం లేకుండా మండలంలోని పరిధి పూర్ గ్రామానికి చెందిన రాజకుమార్‌తో రెండవ వివాహంచేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఈ వివాహం నాకు ఇష్టం లేదని నాకు ఇదివరకే నెల్లికొండి గ్రామానికి చెందిన సంతోష్ కుమార్‌తో వివాహం చేశారని మైనర్ బాలిక అధికారులకు వివరించారు.ఈ పెళ్లిని అడ్డుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు మేరకు బాల్యవివాహాన్ని సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటామని అలాగే మైనర్ బాలికను ఐసిడిఎస్ అధికారులకు అప్పజెప్పినట్లు తహసిల్దార్ ఎల్లన్న తెలిపారు. జిల్లాలోని సిడబ్ల్యూఎస్‌కు మైనర్ బాలికను పంపించినట్లు ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు.



మైనర్ బాలిక నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న అధికారులు

# ఉల్లాస్‌తో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

**చిన్న చింతకుంట, సెప్టెంబరు3 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చుటకై నవభారత్ సాక్షరతా మిషన్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని బుధవారం మండల వనరుల భవనంలో ఉల్లాస్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 3300 మంది 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులు ఉన్నారని వారందరికీ విద్యాభివృద్ధికి ఉల్లాస్ వాలంటరీస్ కృషి చేసి అక్షరాస్యులుగా మార్చాలని తెలియజేశారు.అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగవేణి మాట్లాడుతూ గ్రామాల వారిగా ఉల్లాస్ వాలంటరీలను ఎంపిక చేయాలని ప్రతి వాలంటీర్‌కు పదిమంది నిరక్షరాస్యులకు బోధించి అక్షరాస్యులను చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మురళి కృష్ణ మాట్లాడుతూ మూడు నెలల్లో 200 గంటల పాటు వాలంటరీస్ విద్యాబోధన చేయాలని సమాజంలో అందరికీ విద్యావృత్తి నైపుణ్యాలు అలవర్చుకునేలా ఈ విద్యాబోధన సాగాలనివాలంటరీస్ గ్రామ సామాజిక చైతన్య కేంద్రాలైన పాఠశాల, గ్రామపంచాయతీలేదా కమ్యూనిటీ హాల్ భవనాలనందు ఉల్లాస్ వాలంటరీస్ ఉదయము, సాయంత్రం వేళలో బోధించాలన్నారు. విద్యా వాలంటరీస్‌గా 8వ తరగతి లేదా ఆపై చదువులు చదివిన వారినినియామకం చేసుకున్నారని, బోధకులకు విద్యా క్రెడిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఆయన తెలిపారు. అభ్యాసకులకు కూడా మూల్యాంకనం చేసి వారికి కూడా సర్టిఫికెట్స్ అందజేస్తామని మండల విద్యాధికారి తెలియజేశారు. సంపూర్ణ అక్షరాస్యతతో కూడిన తెలంగాణ ఏర్పడాలని మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం మేరకు ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుమారస్వామి,తిరుపతయ్య నియమించారు. మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చారు.ఈ సమావేశంలో సిఆర్పిలువిజయసింహ,ప్రవీణ్, ఆయా గ్రామాల విఓఎలు పాల్గొన్నారు.



ఉల్లాస్ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- నియోజకవర్గం వ్యాప్తంగా బిజెపి నిరసన దీక్షలు**
**- బిజెపి రాష్ట్ర నాయకులు తల్లోజి ఆచారి**

**కల్వకుర్తి, సెప్టెంబర్3 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యులు బిజెపి రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై బుధవారం బిజెపి పార్టీ నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టారు. పట్టణంలోని తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపం వద్ద పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షుడు బాబిదేవ్ అధ్యక్షతన నిర్వహించిన నిరసన దీక్షకు ముఖ్యఅతిథిగా బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజి ఆచారి పాల్గొని మాట్లాడుతూ వృద్ధులకు రూ.2వేలపింఛన్ రూ.4వేలుచేస్తామని, వికలాంగులకు రూ.6వేల పింఛన్లు,ఇంట్లో ఇద్దరికీ పించన్లని, మహిళలకు రూ.2,500 ఇస్తామంటూ ఇలా అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వదిలిపెట్టి ప్రసక్తి లేదని అన్నారు. త్వరలో పెద్ద ఎత్తున పథకాలు అందని వారితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమంనిర్వహిస్తామని చెప్పారు.ఎన్నికల సమయం లో 6 గ్యారెంటీలకు సంబంధించిన హామీల కర పత్రాన్ని చూపించారు. నిరసన దీక్షలో బిజెపి నాయకులు దుర్గాప్రసాద్, నరసింహ, శేఖర్ రెడ్డి,రాఘవేంద్రర్‌గౌడ్, రాంభూపాల్‌రెడ్డి,రవిగౌడ్, గంగాధర్‌చారి, నరేష్‌చారి, అభిలాష్‌రెడ్డి, వివేకానంద, రఘులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

## భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

**బిజినేపల్లి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణ మధ్య శ్రీ మదలర్మేల్ మంగ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ద్వారా గాని తెలిసి తెలియక చేసే తప్పులకు ప్రాయశ్చిత్తంగా పవిత్ర ఉత్సవాలు నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. శ్రీపాంచరాత్ర ఆగమోక్తంగా సర్వలోప ప్రాయశ్చితార్థమై పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాపరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక మోసాలను అరికట్టడానికి అవగాహన

**వనపర్తి రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి అవగాహన అవసరమని మహిళా సాధికార శాఖ కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా బుధవారం వనపర్తి మండలంలోని అంకూర్ గ్రామంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల నిర్మూలనపై ప్రతి ఒక్కరుకృషి చేయాలని సూచించారు.ఆడ పిల్లలను చదివించాలని,ఆడపిల్లల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు అందించే సుకన్య సమృద్ధి యోజన, ముద్ర, పిఎంకెవివై, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి ఆర్థిక మోసాలను అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసు పునరుద్ధరణ



బస్సు సర్వీసును పునరుద్ధరించిన దృశ్యం

**మాగనూర్, సెప్టెంబరు3 ప్రభాతవార్త:** నిర్విరామంగా కురుస్తున్న భారీ వర్షాలకు మాగనూర్ మండలంలో వడ్వాట్ నుండి మందిపాల్ వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారడంతో బస్సు సర్వీస్ ను అధికారులు 20 రోజుల క్రితం రద్దు చేశారు. ఈ విషయం మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి వెళ్లడంతో మంత్రి ఆదేశానుసారం రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ తెలిపారు. బుధవారం అధికారులు బస్సు సర్వీసును ప్రారంభించడంతో బస్సు సర్వీస్ ఉన్న గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

**ఖిల్లాగణపురం సెప్టెంబర్3, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ కార్యదర్శి మండల రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలని స్థలాలు లేని వారికి స్థలాలు ఇప్పించాలని ఇండ్లు లేని కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురై చనిపోతే వారి వారసులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మరణించిన వారి కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయలు దహన సంస్కారాల కొరకు తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పానుగంటి శ్రీనివాసులు పల్లపు శ్రీనివాసులు భద్రయ్య దాసు నగేష్ జమ్ములుపుష్ప విజయలక్ష్మి నరసింహులులక్ష్మీనారాయణ రాములు అశోక్‌భాస్కర్‌నాగరాజుపలువురుపారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చేతులమీదుగా జిపిఓలకు నియామక పత్రాల పంపిణీ

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్ హైటెక్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జీపీఓలకు నియామక పత్రాలు అందుకోవడానికి ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ లోకేష్‌కుమార్ తెలిపారు.బుధవారం హైదరాబాద్ నుండి జిపిఓ అభ్యర్థులు హైదరాబాద్ వెళ్ళడానికి చేయాల్సిన ఏర్పాట్లుపై అన్ని జిల్లాలకలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఓ పరీక్షకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతరమంత్రుల చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీఓల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష నిర్వహించి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని జిల్లాల్లో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకుముందస్తు సమాచారం అందించి హైదరాబాద్ వెళ్లేందుకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయా జిల్లాల నుంచి ప్రత్యేక బస్ లలో వారిని నిర్ణీత సమయానికి తరలించాలనికావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని ఆయా జిల్లాల్లోని మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ వీడియో కఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఏఓ భూపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీసీలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్

